



ప్రమాద తీవ్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

వికారాబాద్ కలెక్టరేట్‌లో షార్ట్ సర్క్యూట్

- అప్రమత్తమైన అధికారులు.. మంటలార్పిన ఫైర్ సిబ్బంది
- కార్యాలయంలో అలుముకున్న దట్టమైన పొగ

వికారాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీపై లోడ్ పడడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి వికారాబాద్ కలెక్టరేట్‌లోని సర్వీస్ రూంలో ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. గురువారం సాయంత్రం ఈదురుగాలులు వీయడం, అదే సమయంలో కరెంట్ పోవడంతో కలెక్టరేట్‌లోని సర్వీస్ రూమ్‌లో బ్యాటరీపై ఒక్కసారిగా లోడ్ పడింది. దీంతో షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్‌తో సర్వీస్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి వేశారు. మంటలు వ్యాపించడంతో కలెక్టరేట్ పూర్తిగా పొగతో నిండిపోయింది. ఆ సమయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు, అధికారులు అక్కడే ఉన్నారు. మంటలు అదుపులోకి వచ్చిన తరువాత కలెక్టర్ పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఎలక్ట్రిషన్, విద్యుత్ అధికారులు ఫైర్ సిబ్బంది సహకారంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు.



కలెక్టరేట్‌లో దట్టమైన పొగ

చల్లని తాటి ముంజలు

ఎండల నుంచి తక్షణ ఉపశమనం
ఆరోగ్యానికి మేలు చేసే ముంజలు 7






ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

యాసంగి సాగుకు సంబంధించి వరి ధాన్యం సేకరణకు అధికారులు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ఈనెల మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 128, మేడ్చల్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల చొప్పున ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నులు సేకరించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాల కల్పనలో నిమగ్నమయ్యారు. ఏ గ్రామాల్లో వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందో ఆయా గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా ముందుకు వెళ్తున్నారు.

వికారాబాద్ జిల్లాలో 128 కేంద్రాలు



- మేడ్చల్‌లో 12 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- 15 నుంచి ధాన్యం సేకరణ!
- కేంద్రాల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

వికారాబాద్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఇలా..

ధాన్యం రకం	కొనుగోలు కేంద్రాలు	సేకరణ (మెట్రిక్ టన్నుల్లో)
దొడ్డు	117	90 వేలు
సన్నం	11	10 వేలు


వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 58, ఐకేపీ 30, డీసీఎంఎస్ 28, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో 2 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాలకు ఒకేరోజు ఎక్కువ సంఖ్యలో రైతులు ధాన్యం తీసుకురాకుండా టోకెన్ విధానం అమలు చేయనున్నారు. ఏఈవోలు గ్రామాల వారీగా రైతులకు టోకెన్లు పంపిణీ ఎవరు ఏ రోజున కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురావాలనే సమాచారం టోకెన్లలో

మిగతా 8వ పేజీలో...

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. పక్క రాష్ట్రం నుంచి జిల్లాలోకి ధాన్యం అక్రమంగా తరలిరాకుండా జిల్లా సరిహద్దుల్లో రెండు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. కొడంగల్ మండలం రావులపల్లి వద్ద, తాండూరు మండలం, కొత్లాపూర్ వద్ద ఈ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారుల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించనున్నారు.

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం గాలివాన



వికారాబాద్‌లో ఇంటిపై పడిన కొబ్బరిచెట్టు

వికారాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గురువారం పగటివేళ సూరీడు తన ప్రతాపం చూపగా, సాయంత్రం నుంచి భారీ ఈదురుగాలులు వీచాయి. కొన్ని మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కొడంగల్, బంట్వారంలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, ధారూరు, మర్పల్లి, దుద్యాల్‌లో 40.3 డిగ్రీలు నమోదయ్యాయి. మోమిన్‌పేట్‌లో 40.2 డిగ్రీలు, కోట్‌పల్లి, నాగారంలో 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. వికారాబాద్, యాలాల్ ఏఆర్ఎస్ స్టేషన్‌లో 39.7 డిగ్రీలు, పెద్దేముల్, దోమ, మన్నేగూడ, దౌల్తాబాద్‌లో 38.6 డిగ్రీలు నమోదయ్యాయి. నవాబ్‌పేట్‌లో 12.5 మి.మీ, మోమిన్‌పేట్‌లో 7.0 మి.మీ, మర్పల్లిలో 4.0 మి.మీ, బషీరాబాద్‌లో 2.5 మి.మీ, తాండూరులో 1.5 మి.మీ, కొడంగల్‌లో 0.5 మి.మీ. వర్షం కురిసింది. వీచిన భారీ ఈదురుగాలులకు వికారాబాద్ పట్టణంలో ఓ కొబ్బరి చెట్టు ఇంటిపై పడడంతో కొంత భాగం ధ్వంసమైంది.

సైబర్ నేరాలపై తక్షణమే స్పందించాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపైన వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వెంటనే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదైన ముఖ్యమైన కేసుల పురోగతి, విచారణ స్థితి, న్యాయ పరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసును పరిశీలించి ఛార్జిషీట్లను సకాలంలో దాఖలు చేయాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు సీసీటీవీల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పరిగి, వికారాబాద్, తాండూరు, డీసీఆర్‌బీ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్.. జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

బంట్వారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, గురుకులాలు, పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చౌకధరల దుకాణం, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులతో కాసేపు మాట్లాడారు. వారి కోరిక మేరకు క్రీడా సామగ్రిని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీని తనిఖీ చేసిన సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం చేయొద్దని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, డాక్టర్ మాధూరి ఉన్నారు.

ప్రహరీ నిర్మించాలి

వికారాబాద్: వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు గదిని పరిశీలించారు. కార్యాలయంలో విద్యుత్ మరమ్మత్తులతోపాటు

మిగతా 8వ పేజీలో...



బంట్వారం: బాలికల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

మరమ్మతులకు నిధులు కేటాయిస్తాం

మర్పల్లి: మర్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ మునిరుద్దీన్‌తో కలిసి రికార్డు సెక్షన్‌ను పరిశీలించారు. వర్షాకాలంలో భవనం ఉరిసి రికార్డులు తడుస్తున్నాయని తహసీల్దార్ తెలపడంతో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఎస్టీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. సెప్టిక్ ట్యాంకు చిన్నదిగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ దనంగా మరో సెప్టిప్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మర్పల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలో వంట మనిషి ఉండటంతో వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ సక్రమంగా విధులకు రావడం లేదని, మెనూ పాటించడం లేదని విద్యార్థులు వాపోయారు. మెనూ బోర్డు లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పట్లూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసి ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మునిరుద్దీన్, ఎంపీవో లక్ష్మీకాంత్ ఉన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి వైద్య సేవలపై ఆరాతీశారు. ప్రజలకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

జిల్లాలో నేడు

డయల్ యువర్ డీఎం

వికారాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించడానికి ఉదయం 11 గంటల నుంచి 12 గంటలలోపు 99592 26252 నంబర్‌లో సంప్రదించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోనోకార్పస్ చెట్లు.. ప్రాణాలకు ముప్పు!

- రోడ్ల వెంట ఏపుగా పెరిగిన మొక్కలు
- హైదరాబాద్-వరంగల్ రహదారి, ఔటర్ చుట్టూ ఇవే..
- తొలగించాలని పర్యావరణవేత్తల డిమాండ్

విషం వెదజల్లుతున్న చెట్లు!



అన్నోజిగూడ వద్ద జాతీయ రహదారికిరువైపులా పెంచుతున్న కోనోకార్పస్ మొక్కలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోనోకార్పస్.. ఈ మొక్క పేరు వింటేనే భయపడాల్సిన పరిస్థితి. ఏ జీవాలు తినడానికి ఇష్టపడని ఈ మొక్కలు ఏ కాలంలోనైనా ఏపుగా పెరుగుతాయి. ఎలాంటి ప్రతికూల వాతావరణంలోనైనా ఎదిగే ఏకైక మొక్క ఇది. తెలిసో తెలియకనో గత పదిహేనేళ్ల కాలంలో జిల్లాలో విరివిగా ఈ మొక్కలను నాటారు. ప్రధానంగా రియల్ వెంచర్లలో నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి వృక్షాలయ్యాయి. ఎక్కడ చూసినా కోనోకార్పస్ మొక్కలే.. గత ప్రభుత్వ హయాంలో హరిత హారం కార్యక్రమంలో భాగంగా అవసరమైన మొక్కల కోసం పెద్ద ఎత్తున నర్సరీలను ఏర్పాటు చేశారు. ఈనర్సరీల్లో కోనోకార్పస్ మొక్కలను భారీగా పెంచి పంపిణీ చేశారు. దీంతో వీటి వ్యాప్తి విపరీతంగా పెరిగింది. పార్కులు, రోడ్లకిరువైపుల పెద్దఎత్తున దర్శనమిస్తున్నాయి. ఈ మొక్కల వలన ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులతోపాటు ఇతర వ్యాధులు రావడానికి

మిగతా 8వ పేజీలో...

ఆ మొక్కలను తొలగించాలి



కోనోకార్పస్ చెట్లు చాలా ప్రమాదకరం. రోడ్ల వెంట ఎక్కడ చూసినా ఈ విషపు మొక్కలే కనిపిస్తున్నాయి. పక్షులకు సైతం చోటు కల్పించని ఈ మొక్కలను వెంటనే తొలగించాలి. ఈ మొక్కల వల్ల పర్యావరణానికి హాని. ప్రభుత్వం తక్షణమే తొలగింపునకు చర్యలు చేపట్టాలి.

-వరికుప్పల లింగస్వామి, ఎన్ఎఫ్‌సీనగర్

మేడ్చల్, ఘట్‌కేసర్‌లకు ఎంఎంటీఎస్

- విస్తరణకు కేంద్రం పచ్చజెండా



మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్, ఘట్‌కేసర్ వాసుల ఎంఎంటీఎస్ కల ఎట్టకేలకు నెరవేరనుంది. మేడ్చల్, ఘట్‌కేసర్‌లకు ఎంఎంటీఎస్(మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్) విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్లు రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. నగర శివారులోని మేడ్చల్, ఘట్‌కేసర్ ప్రాంతాలకు ఎంఎంటీఎస్‌ను విస్తరించాలని ఎంతోకాలంగా జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ప్రజల డిమాండ్లను పరిగణలోకి తీసుకుని మేడ్చల్, ఘట్‌కేసర్ ప్రాంతాలకు ఎంఎంటీఎస్ విస్తరణకు ఓకే చెప్పింది. ఈ విస్తరణ పనులను త్వరలోనే దక్షిణ మధ్య రైల్వే త్వరలో చేపట్టనుంది. ఎంఎంటీఎస్ విస్తరణకు డబ్లింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. మేడ్చల్ - బొల్లారం డబ్లింగ్ లైన్ 14 కి.మీ, ఘట్‌కేసర్ - మౌలాలి 12 కి.మీ డబ్లింగ్ లైన్ నిర్మాణ పనులతోపాటు విద్యుదీకరణ పనులు చేయనున్నారు. నగరశివారు ప్రాంతాలైన మేడ్చల్, ఘట్‌కేస్ ప్రాంతాల వరకు ఎంతో అభివృద్ధి చెందింది. ఎంఎంటీఎస్ విస్తరణతో ఆయా ప్రాంతాలకు మరింత ప్రయోజనం చేకూరనుంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

ఎండలతో తస్మాత్ జాగ్రత్త

- మేడ్చల్ జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఆస్పత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పీహెచ్‌సీల వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండల నుంచి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు వివరించాలన్నారు. హాట్ స్పాట్లను గుర్తించాలన్నారు. వడదెబ్బతో వచ్చే వారికి తక్షణమే చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి మల్లీశ్వరి, వైద్యులు శోభారాణి, శ్రీదేవి, గీత, చంద్రకళ పాల్గొన్నారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారికి అనుకూలమైన తేదీ, సమయాన్ని ఎంపిక చేసుకునేలా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రక్రియలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, వల్లభనగర్ తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఎన్ని స్లాట్‌లు బుక్ అయ్యాయని కలెక్టర్ సబ్ రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. వెబ్‌సైట్ మాడ్యూల్స్‌ను ఆన్‌లైన్ ప్రక్రియలో దశలవారీగా ఏ విధంగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ ఫొటో, స్కానింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు.



స్లాట్ బుకింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఉపాధి పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో

యాచారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పంట పొలాల మధ్యన ఫాంపాండ్స్ తవ్వుకోవాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి రైతులను కోరారు. గురువారం మండలంలోని మాల్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. ఫాం పాండ్స్ తవ్వితే వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలమట్టం పెరుగుతుందని తెలిపారు. దీంతో బోర్లు, బావుల్లో నీటి లభ్యత ఎక్కువుంటుందని చెప్పారు. ప్రతి కూలీకి వారవారం వేతనాలందేలా తాము చర్యలు తీసుకుంటున్నట్లుచెప్పారు.

పకడ్బందీగా సన్న బియ్యం పంపిణీ


లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినయోగం చేసుకోవాలని, పథకాన్ని పకడ్బందీగా అమలుచేస్తామని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ బాబాగూడలోని ఓ లబ్ధిదారు ఇంట్లో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమానికి పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు నాణ్యమైన బియ్యం అందించాలనే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని చేపట్టిందన్నారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మున్సిపల్‌కమిషనర్ వెంకటవేణుగోపాల్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్, మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వైస్ గౌడ్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి స్లాట్ స్లిప్‌లు అందజేస్తున్న డీఐటీ మధుసూదన్‌రెడ్డి

మరింత సులువుగా రిజిస్ట్రేషన్లు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ విక్రయాల ప్రక్రియను మరింత సులభం చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తెచ్చిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐటీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం ప్రారంభించిన 15నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పద్ధతి పనితీరును పరిశీలించి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి స్లిప్‌లను అందజేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... ఆస్తుల క్రయవిక్రయాలు చేసే వారికి ఇబ్బందులు కలగకుండా త్వరగా వారు తమ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోజూ 48 రిజిస్ట్రేషన్‌లకు స్లాట్‌బుక్ చేసుకునే వీలు ఉందన్నారు. స్లాట్‌లో పేర్కొన్న విధంగా సమయానికొచ్చి ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చన్నారు. కార్యాలయంలో గంటల తరబడి వేచి ఉండే అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ అయిన 10 నిమిషాల్లో దస్తావేజులు అందజేస్తామన్నారు. 15నిమిషాల్లో తమ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకుని కార్యాలయం నుంచి వెళ్లొచ్చన్నారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోదలచిన వారు ముందు వెబ్‌సైట్‌లో స్లాట్‌ను బుక్ చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు నిబంధనలకు లోబడి ప్రభుత్వ నిర్దేశించిన విధంగా ఆస్తులను ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలకు ముందుకు రావాలి

తలకొండపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యసేవలందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. దేవునిపడకల్‌లో జగ్‌పాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కృష్ణదేవ్‌రెడ్డి నిర్వహించిన కంటి వైద్య శిబిరం గురువారం ముగిసింది. కార్యక్రమానికి రాఘవేందర్‌రెడ్డి హాజరై 200మందికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధామణిదేవి, ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి, శ్రీను, కల్యాణ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కేశంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నెలల తరబడి వేతనాలు బకాయిలున్నాయని తెలిపారు. కార్మికులను రెండో పీఆర్సీ పరిధికి తేవాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. నెలకొకసారి సబ్బులు, నూనె, బెల్లం ఇవ్వాలన్నారు. సంవత్సరానికోసారి రెండు జతల బట్టలు, బూట్లు ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీవో కిష్టయ్య, కార్మికులు రమచంద్రయ్య, రవి, రోశయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

మాడ్గుల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో సిలిండర్లతో నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంతో పాటు నాగిళ్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రమాం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్ ధర పెంచటంతో పేదలపై పెనుభారం పడుతుందని సీపీఎం మండల కార్యదర్శి పులికంటి రమేష్ ఆరోపించారు. నాయకులు పల్లేటి శ్రీశైలం, చంద్రయ్య, నర్సింహ, అంజయ్య, శ్రీను, కాటం రాజు, మహేష్, శివ, అంజయ్య, వెంకటయ్యలు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు, మహిళలు

రిజర్వేషన్లకు ముప్పు కలిగించేలా బీజేపీ కుట్ర



పరిగిలో జై సంధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణ పేరిట రిజర్వేషన్‌లకు ముప్పు కల్గించేలా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుట్రచేస్తోందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే పరిగిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ.. ఏడో గ్యారంటీగా రాజ్యాంగ పరిరక్షణకు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్, పాలాది శ్రీనివాస్, పి.చిన్ననర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌ను విస్తృతపర్చాలి

కొత్తూర్: జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అమలుపరిచేందుకు కాంగ్రెస్ కార్యకర్త కృషిచేయాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీఖాన్ పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాదయాత్రలకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ మండల కమిటీ సభ్యులుగా అగ్గనూర్ విశ్వం, చెన్నయ్య, రవిలను నియమించారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, నాయకులు పి.రఘు, బస్వం, ఇబ్రహీం, దేవేందర్ ముదిరాజ్, నుస్రత్‌బేగం, రవినాయక్, రాందాస్‌నాయక్, మహబూబ్, మహిపాల్‌రెడ్డి, చందురెడ్డి, యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్

ఆలయాల్లో ఘనంగా హోమాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయగణపతి, జ్ఞానసరస్వతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయాల్లో తృతీయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తుల రాక నేపథ్యంలో ఆలయ ధర్మకర్త పోకల బస్వరాజ్ రాజమణి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల రెండోరోజు గురువారం హోమం,ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు(శుక్రవారం) నిర్వహించే సీతారాముల కల్యాణానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. సాయిరెడ్డి, మల్లికార్జున్, దిలీప్‌కుమార్, నాగార్జున్, యాదగిరిరెడ్డి, రామకృష్ణ, సంతోష్, వినయ్‌కుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని అవుశాపూర్ ఉమామహేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు పన్నాల మల్లారెడ్డి తెలిపారు. ఈ నెల 12న జరుగనున్న హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను గురువారం అవుశాపూర్‌లో ఆవిష్కరించారు. అవుశాపూర్ నుంచి ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడ వరకు బైక్ ర్యాలీపై హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవుశాపూర్ మాజీ ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కె.వీరేశం, సదానంద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి దామర్‌చెడ్‌లో భవానీమాత జాతర

బషీరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దామర్‌చెడ్ గ్రామం జగదాంబ భవానీమాత ఆలయం జాతరకు ముస్తాబైంది. శుక్ర, శనివారాలు జాతర జరగనుంది. భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ చైర్మన్, శంకర్ స్వామీజీ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు మహాచండీ హోమం, అనంతరం పార్వతీపారమేశ్వరులు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు, సాయంత్రం అమ్మవారి పల్లకీసేవ, రాత్రి సాంస్కృతిక, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

బాకారంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు

యాలాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాకారం ఆంజనేయస్వామి ఆలయ జాతర నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామని అర్చకులు, ధర్మకర్తలు హర్షవర్ధన్ జోషి, విష్ణువర్ధన్ జోషి గురువారం తెలిపారు. నేడు యాలాల హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో స్వామివారి పల్లకిసేవ, 12న అభిషేకం, అన్నప్రసాదం, రాత్రి రథోత్సవం, 13న ఉదయం సత్యనారాయణస్వామి పూజ, సాయంత్రం పెరుగు వసంతం కార్యక్రమాలుంటాయని వివరించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తా

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తానని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలోని పలుకాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ వేసి గురువారం కృష్ణా నీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పైపులైన్లు వేసి కృష్ణానీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. నాయకులు బద్దం కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణానీటిని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గణితం టీచర్‌ను బదిలీ చేయొద్దు


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరిగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ చక్రపాణిని డిప్యూటేషన్‌పై ఎస్ఎస్ఏకు పంపించవద్దని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్, డీఈవోలకు వినపత్రాలందజేశారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు జెటావత్ శంకర్ మాట్లాడుతూ..ముజాహిద్‌పూర్ పాఠశాలలో 500మంది విద్యార్థులు ఉన్నారని, మ్యాథ్స్ టీచర్‌లేకుంటే విద్యార్థులు అతి ముఖ్యమైన గణితం సబ్జెక్టులో విద్యార్థులు నష్టపోతారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఏ చక్రపాణిని డిప్యూటేషన్‌పై పంపొద్దని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘాల నాయకులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

దుద్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్‌లో ఏర్పాటు చేయనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ కిషన్‌నాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామంలోని 252సర్వే నంబరులో గల 10గుంటల భూమిని గుర్తించి జిల్లా ఆరోగ్య శాఖకు అప్పగించినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, సర్వేయర్ మహేష్, ఏఈఓ వివేక్ పాల్గొన్నారు.

వరి చేను కళకళ!

తాండూరు రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోరు బావుల కింద యాసంగి వరిపంట కళకళలాడుతోంది. చెంగోల్, బెల్కటూర్, నారాయణపూర్, గోనూరు, వీరశెట్టిపల్లి, చింతామణిపట్నం, పర్వతాపూర్, అంతారం, ఖాంజాపూర్ చెనిగేష్‌పూర్, గౌతాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో వరి సాగు చేశారు. పంట ప్రస్తుతం గింజపట్టే స్థితిలో ఉంది. నారాయణపూర్‌లో రవ్వలకొండ రామాలయం వద్ద కాగ్నా నది పరీవాహక ప్రాంతంలో పంట పచ్చగాకన్పిస్తోంది. నీటిఎద్దడి లేకపోవడంతో ఎండేముప్పు తప్పిందని రైతులంటున్నారు.


నారాయణపూర్ రవ్వలకొండ సమీపంలో వరి పంట

చల్లని తాటి ముంజలు

ఎండల్లో తక్షణ ఉపశమనం.. ఆరోగ్యానికి ఎంతో మేలు
ముంజలకు కేరాఫ్ ఆమనగల్లు.. జోరందుకున్న అమ్మకాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదమైన తాటిముంజల సీజన్ రానే వొచ్చింది. ఆరోగ్యానికి శక్తినివ్వడంతో పాటు ఎండవేడి నుంచి ఉపశమనాన్నిచ్చే ముంజల విక్రయాలు జోరందుకున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ముంజల అమ్మకాలు ఎక్కువగా సాగుతాయి. ఎండల నుంచి ఉపశమనం పొందడం, ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతిసిద్ధ తాటి ముంజలను అన్ని వర్గాల ప్రజలు ఇష్టంగా తింటారు. తాటిముంజలకు రాష్ట్రంలోనే ఆమనగల్లు ప్రాంతం ప్రసిద్ధి. ముంజలతో జీర్ణశక్తి మెరుగవుతుంది. చలువనిచ్చే ముంజలను తినేందుకు చిన్నా పెద్ద ఇష్టపడతారు. ముంజలకు డిమాండ్ పెరగడంతో పల్లె, పట్టణం అనే తేడాలేకుండా అన్నిచోట్లా ఇవి లభిస్తున్నాయి. ప్రధానంగా రహదారుల పక్కన ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఎండలో వెళ్లే బాటసారులు ఉపశమనాకి కూల్ డ్రింక్‌లకు బదులు ముంజలు కొంటున్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల మండలాలు ముంజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. తాటి వనాలు, కల్లు, ముంజలకు పేర్గాంచిన ఆమనగల్లు సబ్ డివిజన్‌లో ఏటా ముంజల అమ్మకాలతో రూ.లక్షల వ్యాపారం జరుగుతోంది. మార్చిలో మొదలై ఏప్రిల్‌లో ముంజల వ్యాపారం జోరందుకుంది. వీటి విక్రయాలతో వందలాది మంది గీత కార్మికులు, మహిళలు ఉపాధి పొందుతున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై తాటికాయల రాశులుపోసి ముంజలు విక్రయిస్తున్నారు.


కాయల నుంచి ముంజలను తీస్తున్న గీత కార్మికుడు

తాజా ముంజల అమ్మకాలు

ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాల నుంచి నిత్యం గీత కార్మికులు, వ్యాపారులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తాటికాయలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అక్కడ కాయల నుంచి ముంజలను తీసి విక్రయిస్తుండడంతో జనం ఎక్కువగా కొంటున్నారు. గతంలో తలాటిచెట్ల వద్దే గీత కార్మికులు ముంజలు తీసి గంపలు, తట్టల్లో కానుగాకుల మధ్యలో వేసి హైదరాబాద్, ఇతర పట్టణాలకు తరలించేవారు. కాయల నుంచి ముంజలను బయటకు తీయడంతో దూర ప్రాంతాలకు తరలించి అమ్మే సమయంలో ఎండకు ముంజలు ఎండిపోయేవి. రుచి కూడా తగ్గేంది. దీంతో కొనుగోలుదారులు అనాసక్తి చూపేవారు. ఈ సమస్యను నివారించేందుకు వ్యాపారులు, గీత కార్మికులు వారు అమ్మేచోటనే కాయల నుంచి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. దీంతో తాజాగా కల్లుకారుతూ ఉండే ముంజలను కొనేందుకు జనం ఆసక్తి ఇష్టపడుతున్నారు. ఇదిలా ఉంటే రియల్ ఎస్టేట్ ప్రభావంతో గత పదేళ్లలో తాటి వనాలు తగ్గుతున్నాయి. దీంతో మంజుల దిగుబడి పడిపోయిందని గీత కార్మికులు చెబుతున్నారు. కొరతతో ముంజలకు డిమాండ్, ధర పెరిగాయి. గ్రామస్థులు ప్రస్తుతం ఎక్కువ ధర పెట్టి ముంజలు కొనలేకపోతున్నారు.



డజన్ ముంజలకు రూ.80 నుంచి 100

ముంజల ధర ఏటేటా పెరుగుతోంది. 20ఏళ్ల కింద రూ.10కి డజన్ ముంజలు వచ్చేవి. క్రమంగా డజన్‌కు రూ.20 నుంచి 30.. 50, 70 ఇలా పెరుగుతూ ప్రస్తుతం 80 నుంచి రూ. వందకు డజన్ అమ్ముతున్నారు. వాతావరణం చల్లబడిన సందర్భాల్లో ఈ ధర తగ్గుతుందని విక్రయదారులు చెబుతున్నారు. ముంజల విక్రయాలతో గీత కార్మికులు, మహిళా కూలీలు, యువకులకు ఉపాధి పొందుతున్నారు. తాటివనాల నుంచి పట్టణాలకు ముంజల తరలింపుతో కూలీలు, ఆటో వాలాలకు సైతం ఉపాధి లభిస్తోంది. రవాణా ఖర్చులు పోను రోజుకు రూ.700 నుంచి వెయ్యి వరకు సంపాదిస్తున్నామని కూలీలు పేర్కొంటున్నారు.

ముంజల సేకరణలో వివిధ దశలు

తాటిచెట్టుపైనుంచి కాయలను కిందికి దించడం.. కాయలు వొలిచి ముంజలను వేరుచేయడం వంటివి జాగ్రత్తలతో కూడుకున్నవి. తాటి చెట్టుపైనుంచి కార్మికులు తాడుకట్టి కాయ గెలలను కిందికి దించుతారు. కాయలు చెట్టుపై నుంచి కింద పడితే పగిలి ముంజలు చితికిపోతాయి. అందుకే వాటిని జాగ్రత్తగా సేకరిస్తారు. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాల్లో 2లక్షల వరకు తాటి చెట్లున్నాయి. వీటిలో సగానికిపైగా చెట్లను తాటి కాయలకు, గీతకు ఉపయోగిస్తున్నారు. చాలా వరకు బొత్తలు వృథాగా ఉంటున్నాయి. తాటిచెట్లు గీతకొచ్చిన నాటి నుంచి 30ఏళ్ల వరకు కల్లు గీతకు, ముంజలకు వినియోగిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లోనూ తాటి వనాలు ఉన్నాయి.

ముంజల్లో పోషకాలు మెండు



ప్రకృతి సిద్ధంగా లభించే తాటిముంజలు ఎండవేడి నుంచి మనిషికి తక్షణ ఉపశమనాన్నిస్తాయి. వీటిలో విటమిన్లు, సూక్ష్మపోషక ఎలక్ట్రోలైట్లు, మినరల్స్, గ్లూకోజ్ ఉంటాయి. ఎండలతో శక్తి కోల్పోయే శరీరానికి ముంజలతో తక్షణశక్తి లభిస్తుంది. నీరందుతుంది. జీర్ణవ్యవస్థ వృద్ధి చెందుతుంది. అయితే ముదిరిన ముంజులు ఎక్కువగా తింటే అజీర్ణ సమస్యతో కడుపు నొప్పి వస్తుంది.

- మంజులాదేవి,
ప్రభుత్వ వైద్యురాలు, ఆమనగల్లు


ఆమనగల్లు మండలంలో తాటిచెట్లు

ఉపాధి పొందుతున్నాం



వేసవిలో తాటి ముంజలు అమ్మకంతో ఉపాధి పొందుతున్నాం. తాటిచెట్ల యజమానులు, గీత కార్మికుల నుంచి కాయలు కొని ఆమనగల్లుకు తెచ్చి అమ్ముతున్నాం. రవాణా ఖర్చులు పోను రోజుకు రూ.1000 వరకు కూలి గిట్టుబాటవుతోంది. రవాణా చార్జీలు, చెట్ల యజమానులు ధరలు పెంచడం వల్లే కొనుగోలుదారులకు ధర పెంచాల్సి వస్తోంది. కాయల దిగుబడి కూడా తగ్గింది.

- కొప్పుల మహేశ్, శెట్టిపల్లి

తాటిచెట్లు అంతరిస్తున్నాయి



రియల్ ఎస్టేట్ ప్రభావంతో ఏటేటా తాటిచెట్లు తరిగిపోతున్నాయి. గతంలో ఖాళీ స్థలాలు, పొలాల్లో ఎక్కువగా తాటి చెట్లు ఉండేవి. అభివృద్ధితో పట్టణాలకు కొన్ని కిలోమీటర్ల దూరం వరకు స్థలాలను లేఔట్లు చేస్తున్నారు. తాటిచెట్ల నరికివేతతో ముంజలకు డిమాండ్ పెరిగింది. వేసవిలో కల్లు, ముంజల అమ్మకాలతో కుటుంబ పోషణ చేసుకుంటున్నాం.

చందు, నాగిళ్లతండా


కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

మొయినాబాద్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో అద్దాల మహల్ ఎదుట ఏర్పాటు చేసిన పందిరిలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. అర్చకులు సౌందరరాజన్, గోపాలకృష్ణ, రంగరాజన్‌లతో పాటు ఉత్సవాల నిర్వహణ కోసం వచ్చిన అర్చకులు కల్యాణం తంతును నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి ఎదురుకోల్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు గ్రామస్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం రాత్రి 11:30 గంటలకు ప్రారంభమై 1:30 గంటల వరకు జరిగింది.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

మంచాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలందరి కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరుట్లలో సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి గురువారం సహపంక్తి భోజనాలు చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడం చరిత్రాత్మకమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యున్నతికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వి.హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, చీమల జంగయ్యయాదవ్, ఎద్మ నరేందర్‌రెడ్డి, ఆనంగళ్ల యాదయ్య, సలాం, జెగ్ని వెంకటేష్‌యాదవ్, మల్లేష్, మాసయ్యగౌడ్, మార సురేష్, గుడ్డిమల్ల చంద్రయ్య, ప్రవీణ్, నాగరాజు, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం కావాలి

వికారాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలుగకుండా 2024 యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్, సివిల్ సప్లై, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వడ్ల కొనుగోలు కేంద్రాలను ఈ నెల 15న ప్రారంభించాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని, నాణ్యమైన ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 128 కేంద్రాలు ఏర్పాటవుతున్నాయని, వీటిలో 11 సన్న వడ్లు, 117 దొడ్డు వడ్ల కోసం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 90వేల టన్నుల దొడ్డు వడ్లు, 10వేల టన్నుల సన్న వడ్లు కొనే అవకాశముందని తెలిపారు. ఏప్రిల్ చివరికల్లా కొనుగోలు ఉధృతం అవుతాయని పేర్కొన్నారు. ప్రతీ కేంద్రంలో ధరల వివరాలు, తేమ శాంతి వంటి సమాచారాన్ని ఫ్లెక్సీలతో డిస్‌ప్లే చేయాలని తెలిపారు. రైతుల ఆధార్ నమోదు తప్పనిసరి చేయాలని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, డీఎం సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీసీఎంఎస్ శ్యామ్ రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో బీజేపీ పాదయాత్ర

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ హ్యాట్రిక్ సాధించడం, మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో డీకే అరుణ గెలవడంతో బీజేపీ చేపట్టిన యాదగిరిగుట్ట పాదయాత్ర మండుటెండల్లో కొనసాగుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మూడో రోజు గురువారం చంద్రాయన్‌గుట్ట నుంచి సంతోషన్ నగర్ చౌరస్తాకు చేరింది. పాదయాత్ర చేస్తున్న నాయకులు కోరమోని హరిభూషణ్‌పటేల్, రొల్లు రాధికగౌడ్, బి.కురుమయ్య, రొల్లు రఘురాములుగౌడ్, సామ శంకర్‌రెడ్డి, టి.నర్సింహ, మదన్‌గౌడ్‌లను శ్రీవర్ధన్‌రెడ్డి సన్మానించారు. పార్టీపై ఉన్న అభిమానంతో సనాతన ధర్మాన్ని పాటిస్తూ మండుటెండల్లో యాదగిరిగుట్టకు పాదయాత్ర చేయడం అభినందనీయమని శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు.

కూరగాయల అమ్మకాలకు జాగ చూపండి

చౌదరిగూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తైబజారులో 50 వసూలు చేస్తున్నారు. అదనంగా మరో 50రూపాయాలిస్తాం. కూరగాయాలు విక్రయానికి స్థలం చూపాలని ఓ మహిళా రైతు తైబజారు వసూలు చేస్తున్న వ్యక్తులను నిలదీసింది. ఈ ఘటన గురువారం చౌదరిగూడ సంతలో చోటు చేసుకుంది. జిల్లేడ్ చౌదరిగూడలో ప్రతి గురువారం అంగడి కొనసాగుతోంది. సంతలో కూరగాయాలు కయవిక్రయాలకు గ్రామాల రైతులు, చిరు వ్యాపారులు కూరగాయాలు అమ్మేందుకు వస్తుంటారు. గురువారం తూంపల్లికి చెందిన మహిళా రైతు సునీత కూరగాయాల విక్రయానికి సంతకు రాగా ఆమెకు స్థలం దొరకలేదు. ఎక్కడ కూర్చున్నా తోటి విక్రేతలు ఆమెకు అడ్డు చెప్పారు. దీంతో విసుగు చెంది తాను కూరగాయలు ఎక్కడ అమ్ముకోవాలని ఆవేదన చెందారు. 'ప్రతీ వారం తైబజారుకు 50రూపాయాలు ఇస్తున్నాం. ఇప్పుడు జాగ లేదు. వంద రూపాయలు ఇస్తా. అమ్ముకునేందుకు నాకు జాగ చూపాలి.' అని తైబజారు నిర్వాహకులను ఆమె నిలదీసింది. రైతులు కూరగాయలు అమ్ముకునేందుకు కూడా సౌకర్యం లేకుండా ఎలా అని వాపోయింది.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

కీసర రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం వద్ద సిబ్బంది ఆందోళనకు దిగారు. వేతనాలు రాక కార్మికులు పస్తులుంటున్నారని, ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఉన్నిక్రిష్ణన్, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

నందిగామ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు ప్రతిభతో జాతీయస్థాయిలో రాణించాలని, క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం లభిస్తాయని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండలం మామిడిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను నవీన్‌రెడ్డి నాయకులతో కలసి ప్రాంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసకాకుండా చదువు, క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నీ నిర్వహిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రవిందర్, శ్రీనివాస్, సత్యనారయణ, హన్మంతరెడ్డి, షఫీ, రఘుపతిరెడ్డి, వెంకటేశరెడ్డి, అబ్బాస్, ప్రభు, ప్రతాప్‌రెడ్డి, మొయినుద్దీన్, అశ్రఫ్, పురుశోత్తంరెడ్డి, వినోద్, అన్వర్, రాంరెడ్డి, ఆంజనేయులుగౌడ్, కృష్ణారెడ్డి, నిర్వాహకులు చిట్టి, చందు, రాజు, మనోహర్, మజీద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

చౌదరిగూడ, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిచి.. రాజ్యాంగాన్ని రక్షించుకుందామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య అన్నారు. గురువారం కొందుర్గులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి అనేక మంది యువకులు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. నేటి బీజేపీ పాలకుల అధికారం కోసం కులాన్ని, మతాన్ని వాడుకుంటూ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒంటెద్దు పోకడలతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నారని అన్నారు. గత పదేళ్లలో కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నేడు ఉద్యోగాలను తీసేస్తోందన్నారు. వెంకటేశ్, కృష్ణ, సురేష్, భూపాల్, రఫీక్, జంగయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనను కోరుకుంటున్న ప్రజలు


వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, అంజయ్యయాదవ్, నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు మరోసారి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలననే కోరుకుంటున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ వరంగల్ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలకు భ్రమపడి కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలు ఇప్పుడు ఆలోచిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో వాగ్దానాలను అమలు చేయకపోగా, అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరందించాలనే కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పథకాన్ని చేపట్టారన్నారు. పనులు చివరి దశలో ఉన్న ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరందించాలన్న ఆలోచన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. మల్లా కేసీఆర్ పాలనొస్తేనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారని మాజీ మంత్రి తెలిపారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ క్యాడర్, అభిమానులు తరలిరావాలని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజావరప్రసాద్, కె.నరేందర్, వి.నారాయణరెడ్డి, ఈట గణేష్, కడెంపల్లి శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, నటరాజ్, అంతయ్య, వెంకట్‌రాంరెడ్డి, యుగంధర్, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ, శ్రవణ్, నవీన్, శ్రీకాంత్‌గౌడ్, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సుకు పాటుపడేది బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసమే పని చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం శంకర్‌పల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని సూచించారు. మిగతా పార్టీల్లా మీడియాల్లో ప్రచారానికి బీజేపీ ఆసక్తి చూపదన్నారు. రాజకీయాల్లో అధికారంలోకి వచ్చేందుకు చాలామంది అబద్ధాలు చెబుతున్నారని, దీనిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలన్నారు. అంతకు ముందు పలువురు ముస్లింలు ఎంపీ సమక్షంలో పార్టీలో చేరారు. మండలానికి మహిళా అధ్యక్షురాలు ఉంటే ఆమె భర్త ఫొటోను ఫ్లెక్సీల్లో ఎలాపెడతారంటూ నాయకులు హాల్లో కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీ జోక్యం చేసుకొని.. ఇలాంటి చిన్న విషయాలపై కూర్చొని మాట్లాడుకుందామని సర్దిచెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, కె.ప్రకాశ్, పార్టీ మండలాధ్యక్షురాలు లీలావతి, పట్టణాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహ, పరమేశ్వర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి


నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు సదానందం

కడ్తాల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పూసల కులస్థులు ఐక్యంగా ముందుకు సాగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సదానందం, రాష్ట్ర నాయకులు బత్తుల శ్రీహరి, నాగరాజు పిలుపునిచ్చారు. కడ్తాలలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుపులేటి వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు పి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణ్, కోశాధికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పురుషోత్తం, భాస్కర్, వెంకటేశ్, నారాయణ, కోటయ్య, సోమమ్మ, మంగమ్మ, పద్మ, లక్ష్మి, కృష్ణవేణి, గీత, సరిత, శివలీల, లక్మయ్య, దానయ్య, ఆంజనేయులు, భూలక్ష్మి, స్వరూప, జ్యోతమ్మ పాల్గొన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో చేపల మార్కెట్ నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోరెంకల నర్సింహ

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):ప్రతీ నియోజకవర్గంలో 20లక్షలతో చేపల మార్కెట్‌లు నిర్మాణం, మత్స్యమిత్ర మహిళా గ్రూపుల పునరుద్ధరణ, ఎఫ్‌సీడీసీ స్కీమ్, 90శాతం సబ్సిడీరుణాలు, కోహెడలో హోల్‌సేల్/రీటైల్ చేపల మార్కెట్ పనులను ప్రారంభించాలని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. గురువారం నర్కుడలో ముదిరాజ్ మత్స్యకార మహిళల సమావేశం నిర్వహించారు. ప్రతీ సొసైటీ చెరువు కుంటల్లో చేప, రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీకి ఖాతాల్లో నగదు జమచేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు. కోహెడలో ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన గత ప్రభుత్వం 10 ఎకరాల స్థలం ఇచ్చి మార్కెట్ నిర్మాణానికి రూ.47కోట్లు కేటాయించినా పనులు చేయలేదన్నారు. ఆక్రమణల నుంచి చెరువులు, కుంటలను రక్షించాలన్నారు. ఏప్రిల్, మే నెలల్లో మత్స్యకార సొసైటీల సమస్యలపై అధ్యయనం చేసి మే 15న డిమాండ్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా తలపెట్టామని తెలిపారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి మల్లేశ్, నీరటి అనురాధ, జ్యోతి, మాధవి, సరస్వతి, లక్ష్మి, లతిక తదితరులు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పూజారులు

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు భాగా హాజరయ్యారు. ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పరిగి వెంకటసాయీశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగ అంతయ్య, టి.ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్, రాయల శంకర్, నర్సింహులుగుప్తా, మధు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

» బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చండీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని వైష్ణవి గార్డెన్‌లో శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి కార్యకర్తలు రెడీగా ఉండాలన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్, సుధాకర్‌రెడ్డి, దండే శ్రీశైలం, స్వామిగౌడ్, బాలశివుడు, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'డెయిరీ చైర్మన్‌పై అవిశ్వాసం.. ప్రతిపక్షాల కుట్ర'

హయత్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు మదర్ డెయిరీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డిపై అవిశ్వాసం పెడుతారని వస్తున్న వార్తలను చైర్మన్, తొమ్మిది మంది డైరెక్టర్లు ఖండించారు. గురువారం హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు ల సమావేశంలో చైర్మన్ గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, డైరెక్టర్లు మాట్లాడారు. అవిశ్వాసం బూటకమన్నారు. డెయిరీని ఇబ్బందులకు గురిచేసి పబ్బం గడుపుకునేందుకు కొందరు యత్నిస్తున్నారని విమర్శించారు. డెయిరీని గట్టెక్కించేందుకు తాము కృషిచేస్తుంటే కొందరు అవిశ్వాసం అని లీకులిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లంతా ఒకేతాటిపై ఉన్నామని స్పష్టం చేశారు. త్వరలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఐలయ్యతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. పాడి రైతులను, ఉద్యోగులను, డెయిరీని కాపాడుకుంటామన్నారు. రైతులకు ఇప్పటికే కొన్ని బిల్లులు చెల్లించామని, త్వరలో మరిన్ని చెల్లిస్తామని అన్నారు. ఆస్తులను అమ్మడం కొంత ఆలస్యమైతోందని, అంత వరకు ముఖ్యమంత్రి సహకారాన్ని అర్థిస్తామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు మందడి ప్రభాకర్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, కళ్లపల్లి శ్రీశైలం, కర్నాటి జయశ్రీఉప్పల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మండలి జంగయ్య, గూడూరు శ్రీధర్‌రెడ్డి, పుప్పాల నర్సింహులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా ముఖ్య నాయకుల అంతర్గత సమావేశం నిర్వహించగా ఇందులో మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, రోహిత్ రెడ్డిలతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. జిల్లా నుంచి 150 నుంచి 200 వరకు ప్రత్యేక బస్సుల్లో నాయకులకు, కార్యకర్తల సొంత వాహనాలలో బయలు దేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, బైండ్ల విజయ్ కుమార్, రామ్‌రెడ్డి, గోపాల్, అనంత్‌రెడ్డి, రామస్వామి, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా దాత్రిక కాశీనాథ్


దాత్రిక కాశీనాథ్‌ను అభినందిస్తున్న స్థానికులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా దాత్రిక కాశీనాథ్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ నిర్వాహణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, బత్తుల మధుకర్, జంగ హరికృష్ణ, చాప రాజు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లు.. ప్రాణాలకు ముప్పు!

(ఐదో పేజీ తరువాయి)

కారణమవుతున్నాయని పర్యావరణ వేత్తలు వాపోతున్నారు. కోనోకార్పస్ మొక్కల దరిదాపుల్లోకి ఏ పక్షి సైతం రావడానికి ఇష్టపడక పోవడానికి ఈచెట్లు వెదజల్లే విషవాయువులే కారణమని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.


అన్నోజిగూడ వద్ద జాతీయ రహదారికిరువైపుల కోనోకార్పస్ మొక్కలు

ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ..

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి కిరువైపుల కోనోకార్పస్ మొక్కలే దర్శనమిస్తున్నాయి. అలాగే ఔటర్ రింగ్ రోడ్డుకిరువైల, సర్వీస్ రోడ్లకు రెండుపైపుల గతంలో నాటిన మొక్కలు పెరిగి వృక్షాలయ్యాయి. జాతీయ రహదారి వెంట నాటిన మొక్కలను మాత్రం తరచూ కత్తిరిస్తూ కేవలం నాలుగడుల ఎత్తుకు మించకుండా చర్యలు తీసుకున్నారు. ఘట్‌కేసర్ మండలంలోని అన్నోజిగూడ నుంచి యాదాద్రి జిల్లా రాయగిరి వరకు రహదారికి ఇరువైపుల ఈ మొక్కలు పెద్ద సంఖ్యలో దర్శనమిస్తాయి. ఇటీవల ఈ మొక్కల ప్రభావంపై శాసనసభలోనూ చర్చించారంటే సమస్య ఎంత ఈ తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెద్ద మొత్తంలో విస్తరించిన కోనోకార్పస్ మొక్కలను తొలగించి వాటిస్థానంలో పర్యావరణంకు దోహదపడే మొక్కలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే రియల్ ఎస్టేట్ సంస్థలోని చెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

పర్యావరణానికి హానికరం



ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల స్థలాల్లో పెద్ద సంఖ్యలో నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఈ మొక్కలు విష వాయువులను వెదజల్లుతాయి. వెంటనే చర్యలు తీసుకోవాలి లేకపోతే స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. వాటిని తొలగించి ఆ స్థానంలో ప్రకృతికి దోహదపడే మొక్కలను నాటాలి.

- పిట్టల శ్రీశైలం, పర్యావరణ ప్రేమికుడు

ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)

నమోదు చేయనున్నారు. తేదీ, కొనుగోలు కేంద్రం, గ్రామం, రైతు వివరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు టోకెన్‌పై ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకు 27.25 లక్షల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని నిర్ధారించారు. ప్రస్తుతం 1.26 లక్షల బస్తాలు అందుబాటులో ఉన్నాయని, మరో 15,099 గన్నీ బస్తాలు కావాలని ఆర్డర్ ఇచ్చారు. గ్రేడ్ - ఏ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం (గ్రేడ్-బీ) ధాన్యానికి రూ.2,300 మద్దతు ధర చెల్లించనున్నారు. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 అదనంగా చెల్లించనున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చే ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ 17 శాతం మించకుండా, చెత్త చెదారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించనుంది.

మేడ్చల్ జిల్లాలో చకచకా ఏర్పాట్లు

జిల్లాలో వరి ధాన్యం సేకరణకు పౌర సరఫరాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మొదట మండలానికి ఒకటి చొప్పున ఐదు మండలాల్లో ఏర్పాటు చేయనున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా పంట ఇంకా కోత దశకు రాలేదు. పంట కోతకు రావాలంటే ఇంకా నెల నుంచి నెలన్నర సమయం పట్టే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు మిల్లర్లతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే ధాన్యాన్ని కట్టడి చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఐరిస్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో పట్టా పాసు పుస్తకం ఉండి సాగు చేసిన రైతే కేంద్రానికి వచ్చి ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంటుంది. కేంద్రాల్లో ఓటీపీ విధానాన్ని కొనసాగిస్తూనే రైతుల ఐరిస్ సైతం తీసుకుంటారు. ప్రతి కేంద్రం వద్ద వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి ఉండేలా చూస్తున్నారు. ట్యాబ్‌లో పేరు నమోదు కాని రైతు.. ఏఈఓ వద్ద ధ్రువీకరణ తీసుకొని విక్రయించవచ్చునని అధికారులు చెబుతున్నారు.

కేంద్రాల ఏర్పాటులో అధికారులు బిజీబిజీ

కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. కొనుగోళ్లు ప్రారంభం కాగానే డిమాండ్‌కు తగ్గట్లు గన్నీ బస్తాలు ఆర్డర్ ఇవ్వాలని నిర్ణయించారు. తూకం యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, తేమ నమోదు చేసే మీటర్లు, క్యాలీబర్ల వంటివి సమకూర్చుకునే పనిలో పడ్డారు. తూకం యంత్రాలు 308, తేమ శాతం కొలిచే యంత్రాలు 195, ప్యాడీ క్లీనర్లు 55, క్యాలీబర్లు 20, టార్పాలిన్ షీట్లు 3,597 అందుబాటులో ఉంచారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో ఆన్‌లైన్ ద్వారా డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం


సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

నవాబుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండలంలోని చించల్‌పేట్‌లోని రేషన్ దుకాణంలో గురువారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం


బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపన్ చెరువు తండా నుంచి 163 జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే గ్రామాలు, తండాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, డైరెక్టర్ మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేశ్యానాయక్, చంద్రప్ప, సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, గోపాల్, చందర్, హన్మంతు, కుమ్మరి వెంకటయ్య పాల్గొన్నారు.

చౌరస్తాలను విస్తరించాలి

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్, వినాయక చౌరస్తాలను విస్తరించి ప్రమాదాలకు నివారించాలని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాన కూడళ్లు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ప్రతీ నిత్యం నరకయాతన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇటీవలే మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా అంబేడ్కర్, వినాయక చౌరస్తాల విస్తరణకు నిధుల మంజూర్‌తో పనులు చేపడతామన్నా పనులు మాత్రం చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అంబేడ్కర్, వినాయక చౌరస్తాల విస్తరణతో వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మున్నూరు కాపుల రణభేరిని జయప్రదం చేయాలి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండల కమిటీ అధ్యక్షులు కటికం రాజుపటేల్ ఆధ్వర్యంలో గురువారం మున్నూరుకాపుల రణభేరి చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్నూరుకాపు రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం సమస్యలపై ఈ నెల 13న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మున్నూరుకాపుల రణభేరిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్, మండల కమిటీ ఉపాధ్యక్షుడు జైహింద్, కోశాధికారి భాగయ్య, సలహాదారులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చౌడాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు కటారి బాల్‌రాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ సమక్షంలో గురువారం పార్టీలో చేరగా కండువాతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, మండల వర్కింగ్ ప్రసిడెంట్ సలీమ్, రాము, చిన్నయ్య, కృష్ణయ్య, నర్సింహులు, శ్రీను, అంజి, గోపాల్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చౌడాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో పంచాయతీ కార్యదర్శి రాజీరెడ్డి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు, ఎంపీడీవో సోమలింగం, మండల వ్యవసాయ శాఖ అధికారి పరిమళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రెస్ మెటీరియల్ అందజేత

దుద్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు మహిళా సంఘాలకు డ్రెస్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, ఎంఈవో విజయరామారావు, ఎంపీడీవో మహేశ్‌కుమార్, ఏపీఎం సాయన్నయాదవ్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ధారూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీక్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన 'గావ్ చలో, బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన చెప్పారు. ఈనెల 11 నుంచి జిల్లా, మండల, గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు పార్టీ శ్రేణులంతా కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్, నాయకులు విశ్వనాథం, వివేకానందరెడ్డి, ఎం.రమేశ్, రవీందర్‌గౌడ్, వెంకట్, కె.అంజయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి


తాండూరు రూరల్: మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

తాండూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం తాండూర్ మండలంలోని నారాయణపూర్, గోనూర్, విరిశెట్టిపల్లి గ్రామాల్లో నిర్వహించిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ సమావేశాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జర్నీ నాగప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యువజన నాయకులు అనిల్, సీనియర్ నాయకులు రాందాస్, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

బషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రను తిప్పికొట్టాలని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా మూడోరోజు గురువారం ఆపార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో గొట్టిగఖుర్దు, గొట్టిగకలాన్, బద్లాపూర్, బద్లాపూర్‌తండా, కాశీంపూర్, కుప్పన్‌కోట్ తదితర గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పి.శంకర్‌రెడ్డి, రామునాయక్, సాయిల్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్‌లో గురువారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

యాలాల: భారత రాజ్యాంగాన్ని మార్చితే బీజేపీ పునాదులు ఊడిపోతాయని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డిలు హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకుల ఆదేశానుసారం గురువారం వారు యాలాల మండల పరిధిలోని ముద్దాయిపేట్, తుప్పెర్లగడ్డతండా, సంగాయిగుట్టతండా, అచ్యుతాపూర్ గ్రామాల్లో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్, రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, మధుసూదనరెడ్డి, భీమయ్య, నర్సింహులు, చిన్న, రాజు, వెంకటయ్య, రఘురాంరెడ్డి, దేవనూరు కాశీం పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్


మోమిన్‌పేట్: చెక్కులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.11.50లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, సిరాజుద్దీన్, ఏరాజ్‌పాష పాల్గొన్నారు.

దుద్యాల: మండలంలోని ఈర్లపల్లికి చెందిన నీలి విట్టల్, సంద్రకుంట తండాకు చెందిన బిల్యానాయక్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.90,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, పిట్ల మొగులయ్య గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాహుల్, చెన్నారెడ్డి, సాల్యనాయక్, శంకర్‌నాయక్, రతన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని రాకొండ తండాకు చెందిన గోవింద్‌నాయక్‌కు మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మచ్చేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చాపల వెంకటమ్మ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ, నర్సింగ్‌నాయక్, పాండ్యనాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశానుసారం గురువారం బాపల్లి తండాకు చెందిన డెగావత్ ప్రతాప్‌కు మంజూరైన రూ.50వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ యువ నాయకుడు బాపల్లి సంతోష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోత్యానాయక్, మహేందర్‌సింగ్, దాస్యనాయక్, చత్రురాథోడ్, హీర్యానాయక్, గోపాల్‌నాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షల వెల్లువ


శుభాకాంక్షలు తెలుపుతున్న ముల్లి పావని

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతుల పెళ్లిరోజు (సిల్వర్‌జూబ్లీ) సందర్భంగా పలువురు నాయకులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్ సింగారంలోని ఆయన నివాసంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నుంచి పలువురు రాజకీయ నాయకులతో పాటు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, యాదగిరియాదవ్, మహేష్ గౌడ్, అనిల్, అంజిరెడ్డి, కుమార్, ముత్యాల్ యాదవ్, కుమార్ పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

పరిగి,ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పరిగిలో ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య, బస్సు చంద్రయ్యలు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 11ఏళ్లలో అనేక మార్లు ధరలు పెంచి పేదలపై తీవ్ర భారం మోపుతున్నారని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, యాదయ్య, రఘురాం, వెంకటయ్య, బలరాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

(ఐదో పేజీ తరువాయి)

ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దివ్యాంగుల ఉపాధి నిమిత్తం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపును పరిశీలించి కావాల్సిన సౌకర్యాలను సమకూర్చుకోవాలని డీఆర్డీవో శ్రీనివాస్‌కు సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

వైద్య సేవలపై ఆరా

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ పీహెచ్‌సీని కలెక్టర్ ప్రతీక్ జైన్ తనిఖీ చేశారు. గర్భిణులతో మాట్లాడి స్కానింగ్ రిపోర్టులను పరిశీలించారు. స్కానింగ్ కోసం గర్భిణులను తాండూర్, వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించి స్కానింగ్ తీయించి మందులను అందజేస్తున్నామని వైద్యాధికారి మాధవీలత కలెక్టర్ వివరించారు. రోగులలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలి


శామీర్‌పేట: పోషణ పక్షం కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శారద

శామీర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రక్తహీనతను నివారించేందుకై ప్రతి ఒక్కరు పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో శారద పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ 1వ కేంద్రంలో గురువారం పోషణ్‌పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, పావని పాల్గొన్నారు. అదేవిధంగా ఐసీడీఎస్ ఆదేశాల మేరకు శామీర్‌పేటలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై హెల్త్ సూపర్‌వైజర్ వినోద, ఏఎన్ఎం స్వరూపరాణి, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి అవగాహన కల్పించారు.

మోమిన్‌పేట్: పోషణ పక్వాడలో భాగంగా మోమిన్‌పేట్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం విశిష్టత గురించి అంగన్‌వాడీ టీచర్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మర్పల్లి ప్రాజెక్టు సీడీపీవో ప్రవీణ, సూపర్‌వైజర్ పుష్పలత, రిజ్వాన పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ అంగన్‌వాడీ కేంద్రంలో నాగారం బస్తీ దవాఖానా వైద్యుడు కుమార్ గురువారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రేచల్, సూపర్‌వైజర్ అంజమ్మ పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని గోప్యనాయక్ తండాలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ మహిళలకు రక్తహీనత, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ, ఆరోగ్య సిబ్బంది సుజాత, స్వప్న పాల్గొన్నారు.


కీసర రూరల్: పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు కుమార్



సంక్షిప్తంగా..

తైబజార్ వేలం

బొంరాస్‌పేట్: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలం నిర్వహించారు. ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఎంపీవో రవి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ రూ.59వేలకు దక్కించుకున్నాడు.

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

కొడంగల్: హస్నాబాద్‌లో గురువారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.

ఆలయానికి కలశం బహూకరణ

దుద్యాల: కాంగ్రెస్ యువ నాయకుడు సూర్యప్రకాశ్‌రెడ్డి ఆలయానికి కలశాన్ని బహూకరించారు. సేడం తాలూకా ఆడికెలోని హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు గురువారం రూ.19వేలు విలువ గల కలశాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

దోమ: విద్యార్థుల విద్య ప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయలని ఎంఈవో వెంకట్ సూచించారు. మండలంలోని కిష్టాపూర్, కేకే తండా పలుగుతండా, పెద్ద తండా పాఠశాలలను గురువారంఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

పరిగి: పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ క్యాంస విగ్రహం ఏర్పాటుకు మహేశ్‌రెడ్డి వ్యక్తిగతంగా రూ.లక్ష నగదును అందజేశారు.

కేంద్రం నిధులపై ప్రజలకు వివరించాలి

పరిగి: తెలంగాణ అభివృద్ధి గురించి కేంద్రం ఇస్తున్న నిధుల గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి అన్నారు. పరిగిలోని ఎస్వీగార్డెన్‌లో గురువారం జరిగిన క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గావ్ చలో గర్ చలో భాగంగా ప్రతి వార్డులో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం హర్షణీయం

పూడూరు: తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ఎస్సీ వర్గీకరణ బిల్లును గవర్నర్ ఆమోదం పొందడం హర్షణీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కద్మూరు ఆనందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లు ఆమోదంతో కాంగ్రెస్ పార్టీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఎస్సీ బిడ్డలంతా రుణపడి ఉంటామని ఆనందం తెలిపారు.

నేడు సీసీరోడ్లకు ప్రారంభోత్సవం

ధారూరు: ఎంపీ, ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను నేడు(శుక్రవారం) చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీజేపీ అసెంబ్లీ కో ఆర్డీనేటర్ వడ్ల నందు ఒక ప్రకటనలో తెలిపారు.

సన్నాహక సభను విజయవంతం చేయాలి

మేడ్చల్ టౌన్: ఈనెల 14న నిర్వహిస్తున్న మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సన్నాహకసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.